క్లుప్తంగా

మాడుగుల తహసీల్దారుకు సత్కారం



తహసీల్దారు సత్యనారాయణను సత్కరిస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ తదితరులు

మాడుగుల: ఎన్నికల బదిలీల్లో భాగంగా వారం రోజుల క్రితం మాడుగుల తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన టి. సత్యనారాయణను జెడ్పీటీసీ కిముడు రమణమ్మ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయనకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జాలంపల్లి సర్పంచ్ చిన్ని పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో భక్తులు

నర్సీపట్నం: చెట్టుపల్లిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఏటా మాదిరిగానే సారె ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పుట్టింటి నుంచి అత్తాంటికి పంపినట్టుగా చీర సారెతో గౌరీదేవిని సాగనంపారు. మహిళలు వివిధ రకాల పిండి వంటలతో సారె ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీధుల్లో గౌరీ పరమేశ్వరుల సారె ఉత్సవం కొనసాగింది.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎంపీపీ రాజారామ్



డిప్యూటీ సీఎం బూడిని సత్కరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్

మాడుగుల: ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ సోమవారం ఉదయం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాడుగుల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలుపై చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఎంను దుశ్శాలువా కప్పి సత్కరించారు.


కవగుంటలో ఉపాధి పనులు ప్రారంభం



నూకాలమ్మ చెరువులో పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

రావికమతం: మండలంలోని శివారు గ్రామం కవగుంటలో ఉపాధి హామీ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలో 200 మంది జాబ్ కార్డుదారులున్నారు. వీరంతా సీజన్‌లో పడమట కూలి పనులకు వలస వెళ్తుంటారు. దానిని అరికట్టేందుకు గాను స్థానికంగా ఉపాధి కల్పించేందుకుగాను నూకాలమ్మ చెరువులో పనులు ప్రారంభించారు. ప్రతి జాబ్‌కార్డుదారు నిర్ణీత సమయానికి హాజరై రోజుకు రూ.272 కూలి గిట్టుబాటయ్యేలా పని చేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి సూర్యకుమారు వరహాలు కోరారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ అప్పలనాయుడు

చోడవరం: మెగా రక్తదాన శిబిరంలో పెద్దసంఖ్యలో యువకులు రక్తదానం చేశారు. చోడవరం రాక్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రేమ సమాజంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఎస్‌ఐ అప్పలనాయుడు ప్రారంభించారు. 80 మంది యువకులు రక్తదానం చేశారు. సంజీవని హాస్పిటల్ పర్యవేక్షణలో రక్తసేకరణ, వైద్య పరీక్షలు నిర్వహించారు.

చింతపాక.. అభివృద్ధి పతాక

- రూ.23 కోట్లతో సంక్షేమం, గ్రామాభివృద్ధి
- నేడు పలు పనులకు ప్రారంభోత్సవాలు
- హాజరు కానున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం



గ్రామానికి వేసిన తారు రోడ్డు



ప్రజల ఆరోగ్యం కోసం నిర్మించిన హెల్త్ క్లినిక్

బుచ్చెయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చింతపాక పంచాయతీ రూపురేఖలు మారిపోయింది. నాణ్యమైన బీటీరోడ్డు అందుబాటులోకి రావడంతో రవాణా కష్టాలు తీరాయి. ఇక్కడ సంక్షేమ పథకాలతోపాటు సచివాలయ సముదాయం, తదితర అభివృద్ధి పనులకు రూ. 23 కోట్లు వెచ్చించారు. వీటి ప్రారంభోత్సవాలను మంగళవారం పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

మండలానికి శివారు పంచాయతీ చింతపాక గ్రామ అభివృద్ధిపై గత టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించ లేదు. వైఎస్సార్ సీపీ గద్దె నెక్కిన వెంటనే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆర్బీ రోడ్డు నుంచి చింతపాక వరకు శిథిలమైన రోడ్డుకు వెంటనే నిధులు మంజూరు చేయించారు. రూ.25 లక్షలతో గ్రామానికి తారురోడ్డు వేయించి గ్రామస్తులకు రవాణా కష్టాలు తొలగించారు. రూ.42 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.21 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించారు. వీటిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మండల నాయకులు, అధికారులు ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. గ్రామంలో జలజీవన్ మిషన్ నుంచి రూ.55 లక్షలతో ఇంటింటి కుళాయిలు, రూ.16 లక్షలతో మురుగు నీరు బయటకు పోయేలా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో ప్రభుత్వం చేపట్టిన సర్వేలో రెవెన్యూ పరిధిలో 1,200 ఎకరాలకు ఉచితంగా సర్వే చేసి 1,450 మంది రైతులకు శాశ్వత భూ పట్టాలు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు ద్వారా ఇప్పటి వరకు రూ.20 కోట్లు లబ్ధిదారులకు అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్లలో గ్రామానికి రూ.23 కోట్ల అభివృద్ధి, సంక్షేమ లబ్ధి చేకూరిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

చింతపాకలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విప్ ధర్మశ్రీ ప్రారంభిస్తారని ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు. ఈ శిబిరాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తామన్నారు. రోగులు వచ్చి ఉచితంగా వైద్య సేవలు, మందులు పొందాలన్నారు.



రైతుల కోసం నిర్మించిన రైతు భరోసా కేంద్రం

అన్ని విధాలా అభివృద్ధి



మా గ్రామంలో సచివాలయ సముదాయ భవనాలతోపాటు కాలువలు ఏర్పాటు, ఇంటింటికీ కుళాయి నీరు అందించడం, తారురోడ్డు వేయడం ఆనందంగా ఉంది. నా గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి మా గ్రామస్తులంతా రుణపడి ఉంటాం. ఒక రాజకీయ నాయకుడిగా నా గ్రామాన్ని అభివృద్ధి చేశానని గర్వంగా ఉంది.

– గొలజాన శ్రీను, సర్పంచ్, చింతపాక

నూతనంగా 18 తాగునీటి బోర్ల ఏర్పాటు



బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: తాగునీటి ఇబ్బందులు లేకుండా బోర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. రామారాయుడుపాలెంతో పాటు పాపయ్యపాలెం గ్రామ శివారు దారకొండ క్షేత్రం వద్ద సోమవారం నూతన చేతిపంపుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తాగు, సాగు నీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో కొత్తగా రూ.18 లక్షల మండల పరిషత్ నిధుల నుంచి 18 బోర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టినట్టు వివరించారు. బూరుగుపాలెం పరిదేశమ్మ ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి భీమిరెడ్డి గోవింద బోరు నిర్మాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు ఇటంశెట్టి శ్రీను, నాయకులు రుత్తల నాయుడు, రమణ, పైల సత్తిబాబు, లక్ష్మణ , శ్రీను పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: వ్యాసరచన పోటీల్లో ఎంజేపీ బీసీ బాలుర గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ వారు ఆచార్య గురు దేవోభవ అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో పాఠశాల నుంచి విద్యార్థులు టి.వెంకట అప్పారావు, ఆర్.గురుచరణ్, జి.తేజ పాల్గొన్నారు. ఈ పోటీల్లో సమాజంలో గురువు ప్రాముఖ్యతను విపులంగా వివరించారు. వారి ప్రతిభకు గుర్తింపుగా సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి అందజేశారు. ఇలాంటి వాటిలో రాణించటం వల్ల పోటీ పరీక్షలను దీటుగా ఎదుర్కోగలరన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బాబ్జి, ఆర్గనైజేషన్ సభ్యులు టి.లోవరాజు, వి.శివసాయి కిరణ్ పాల్గొన్నారు.

15 నుంచి చోడవరం వార్డుల్లో పర్యటన

- వార్డు మెంబర్లు, గృహసారథుల సమావేశంలో ప్రభుత్వ కరణం ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

చోడవరం: ప్రజల యోగక్షేమాలు తెలుసుకునేందుకు నేరుగా క్షేత్రస్థాయిలో వారితో సమీక్షించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి చోడవరం పట్టణంలో వార్డుల వారీగా సమీక్షలు నిర్వహించనున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చోడవరం మేజర్ పంచాయతీ వార్డు మెంబర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఇప్పటికే అనేకం చేశామన్నారు. అదేవిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వార్డుల వారీగా ప్రజలతో నేరుగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. చోడవరం మేజర్ పంచాయతీలోని 20 వార్డుల్లో 105 మంది వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. మరింతగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు రోజుకొక వార్డు చొప్పున పర్యటిస్తామన్నారు. ఒక్కొక్క వార్డులో కనీసం 300 మందితో సమీక్షించి అక్కడ నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం అందించిన పథకాలపై మరింతగా వివరిస్తామన్నారు. వార్డుల పర్యటనను విజయవంతం చేయడంలో వార్డు మెంబర్లు, నాయకులు, గృహసారథులు, వలంటీర్లు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్, ఉప సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, పుల్లేటి వెంకట్రావు, మండల, పట్టణ అధ్యక్షులు దొడ్డి వెంకట్రావు, దేవరపల్లి సత్య, యర్రా దేవి, అల్లాడ భవానీ, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



నర్సీపట్నం: సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం ఓటర్లకు సూచించారు. ఎన్నికల నిర్వహణ సిబ్బందితో సోమవారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎక్కడికక్కడ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం వారందరితో ప్రతిజ్ఞ చేయించారు.

నాతవరం: పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. నాతవరంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు. ఓటు నిర్భయంగా వేయాలని అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, ఆర్ఐ హరి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు దొర్లకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్వోలతో ఆయన సమావేశమయ్యారు. మృతులు, వలసదారుల పేర్లు తొలగింపులో వారి కుటుంబ సభ్యుల ఆమోదం తీసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో తనిఖీలు



నిండుగొండ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో జానుప్రసాద్

రోలుగుంట: మండలంలో పలు పాఠశాలలను ఎంఈవో జానుప్రసాద్ సోమవారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న బోధనతోపాటు పలు ప్రశ్నల వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.


నిబంధనల ప్రకారం సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఉపాధి సామాజిక తనిఖీలు చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో రాంబాబు తెలిపారు. సోమవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సోషల్ ఆడిట్ 16వ రౌండ్‌కు సంబంధించి సిబ్బందితో సమీక్షించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 మధ్య చేసిన పనులపై తనిఖీలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన, గ్రామసభల నిర్వహణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ సూర్యనారాయణ, ఉపాధి ఏపీవో చిన్నారావు, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



రాధాకృష్ణుల నృత్యడ్యాన్సు

రోలుగుంట: బీబీపట్నంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు, రాజలనాయుడు, రేవళ్ల ఈశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పలు నేలడ్యాన్సులతో ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. రాధాకృష్ణులు, శక్తి డ్యాన్సు, నేలడ్యాన్సు, నాగినీ డ్యాన్సు వీక్షకులను ఆకట్టుకున్నాయి.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఈశ్వరరావు

బుచ్చెయ్యపేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయొద్దని, రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపివేయకుండా పరిమిత వేగంలో రాకపోకలు సాగించాలని కోరారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారీ చేసినా, బెల్టు షాపుల్లో మద్యం, సారా అమ్మకాలు చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహిళల రుణాలు, రికవరీ, పలు సంక్షేమ పథకాల అమలుపై ఎంపీడీవో వెంకటాచార్య, ఏపీఎం బాలరాజు వివరించారు.

హామీలన్నీ నెరవేర్చాం.. ఆదరించండి



ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అధికారులు

- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్, మహిళలు, అధికారులు

నాతవరం: ఎన్నికల హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి సంబంధించి సోమవారం నాతవరంలో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ సొమ్ము నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో స్వయంగా ప్రజలు సమస్యలు తెలుసుకున్న ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా పథకంలో 55,947 మంది మహిళలకు రూ.159 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. అమ్మఒడి పథకంలో 25 వేల మంది విద్యార్థుల తల్లులకు రూ.148 కోట్లు, వైఎస్సార్ చేయూత పథకంలో 16 వేల మందికి రూ.105 కోట్లు అందించామన్నారు. టీడీపీ హయాంలో 60 నెలల్లో పింఛన్‌దారుకు రూ.63 వేలు అందిస్తే, తమ పాలనలో లక్షా 48 వేల 500 రూపాయలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని కష్టాలు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల విషయంలో పైసా అవినీతి లేకుండా పాలన అందించామన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి నేరుగా గ్రామంలోనే సేవలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రతి లబ్ధిదారు సహకరించాలన్నారు. ముందుగా వైఎస్సార్ చేయూత, ఆసరా పథకం ద్వారా పలు యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందామని ముగ్గురు మహిళలు సభలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరంగా లబ్ధి పొందినందుకు జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. అనంతరం వారిని ఎమ్మెల్యే సత్కరించారు.

కళాశాల మంజూరుపై హర్షం

దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న నాతవరం జూనియర్ కళాశాలను మంజూరు చేయడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారితో కలిసి ఎమ్మెల్యే గణేష్ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కె. అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, ఎంపీడీవో జి.రాంబాబు, వెలుగు ఏరియా కోఆర్డినేటరు కె.సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, నాతవరం –1, 2, ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక, చెక్కా ప్రభావతి, గన్నవరం, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు జి. వరహాలబాబు, ఎ.వరహాలబాబు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: సిటీ క్లబ్ ఆవరణలో అక్రమ కట్టడాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం మున్సిపల్ కమిషనర్ రవిబాబును ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆర్డీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సిటీ క్లబ్‌లో షాపుల సముదాయాన్ని నిర్మిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు స్పందనలో ఫిర్యాదు చేశారు. అక్కడికక్కడే అక్రమ నిర్మాణంపై సయుక్తంగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను, తహసీల్దారును ఆదేశించారు. శారదానగర్‌లోని పెద్ద చెరువు పంట కాలువ ఆక్రమణకు గురవుతుందని పరిసర ప్రాంత రైతులు ఫిర్యాదు చేశారు. కాలువ ఆక్రమణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆర్డీవో ఆదేశించారు. ఈపాస్ బుక్ ఇప్పించాలని కోటవురట్ల మండలం కొడవటిపూడికి చెందిన ఎ. నాగదేవి, వితంతు పింఛన్ ఇప్పించాలని రోలుగుంట మండలం వడ్డిప గ్రామానికి చెందిన ఎం.దేవి దరఖాస్తు చేశారు. స్పందన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని ఆర్డీవో ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

మాజీ సర్పంచ్ బూడి వెంకునాయుడుకు ఘన నివాళి



తండ్రి వెంకునాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి దంపతులు

దేవరాపల్లి: తారువలో మాజీ సర్పంచ్ స్వర్గీయ బూడి వెంకునాయుడు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తన తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు ఘనంగా నివాళులర్పించారు. తండ్రి స్ఫూర్తితో రాజకీయాల్లోకి అడుగు పెట్టిన తనకు ఆయనే రోల్ మోడల్ అని డిప్యూటీ సీఎం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్నికం బాలచెంచమ్మతల్లి తీర్థం రేపు



బాలచెంచమ్మతల్లి కొలువైన గద్దె

రావికమతం: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గర్నికం బాలచెంచమ్మతల్లి తీర్థ మహోత్సవం బుధవారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లను చేస్తోంది. ఇక్కడ అమ్మవారిని తలచుకుని ఏ కార్యం తలపెట్టినా ఫలితం వస్తుందని గ్రామస్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయానికి ఎటువంటి మాన్యాలు లేవు. దాంతో గ్రామ రైతులంతా ఏటా అమ్మవారి పేరున చోడవరం సుగర్ ఫ్యాక్టరీకు టన్ను చెరకును కేటాయిస్తుంటారు. ఆ ఆదాయంతోపాటు హుండీ కానుకలతో పండుగ ఘనంగా నిర్వహిస్తారు.

పసిడి కలశాల ప్రదర్శన:

అమ్మవారి పండుగ సందర్భంగా వంద మంది గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల భక్తులు సైతం పసుపు దుస్తులు, మాలధారణ చేసి నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం పసిడి కలశాలతో ఊరేగింపు నిర్వహించారు.



మాలధారణ భక్తుల కలశాల ప్రదర్శన